
చార్మినార్‌లో రోడ్డు షో నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్


ప్రచారంలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ సలావుద్దీన్ లోధీ


బైక్ ర్యాలీలో బహదూర్‌పురా కాంగ్రెస్ అభ్యర్థి రాజేష్‌కుమార్


రోడ్డు షోలో చాంద్రాయణగుట్ట బీజేపీ అభ్యర్థి కౌడి మహేందర్

ముగిసిన ప్రచార పర్వం

రోడ్డు షోలు, బైక్ ర్యాలీలు, పాదయాత్రలతో హోరెత్తిన పాతబస్తీ

చార్మినార్, బహదూర్‌పురా, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా తదితర నియోజకవర్గాల్లో ప్రచారం చివరి రోజైన మంగళవారం ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు జోరుగా ప్రచారాన్ని నిర్వహించారు. బైక్ ర్యాలీలు, పాదయాత్రలు, సమావేశాలతో పాతబస్తీ హోరెత్తింది. తాను విజయం సాధిస్తే అన్ని వర్గాల ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తామంటూ ఓటర్లకు హామీ ఇచ్చారు. చార్మినార్‌లో మజ్లిస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల నడుమ త్రిముఖ పోటీ కొనసాగుతుండగా.. యాకుత్‌పురాలో మజ్లిస్, ఎంబీటీ అభ్యర్థుల నడుమ ద్విముఖ పోటీ కొనసాగుతుంది. ఇక బహదూర్ పురా, చాంద్రాయణగుట్టలో నామమాత్రం పోటీతో మజ్లిస్ పార్టీ అభ్యర్థులు ముందంజలో ఉన్నారు. దక్షిణ మండలం పోలీసులు పోలింగ్‌కు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. – చార్మినార్

కార్వాన్‌లో మజ్లిస్ విజయం ఖాయం



గోల్కొండ: కార్వాన్‌లో మజ్లిస్ విజయం ఖాయమని ఆ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే, అభ్యర్థి కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో పాదయాత్ర చేసి ఓటర్లను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశానన్నారు. కార్వాన్‌ను మరింత ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు తనను మరోసారి గెలిపించాలని ఆయన కోరారు. కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు ఆరూన్‌ఫరాన్, బదరుద్దీన్, వజీ ఉజ్జమా, షబ్బీర్‌ఖాన్ ఉన్నారు.

జంగ్ తెలంగాణ 2023

బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం



గోల్కొండ: తెలంగాణను మరింత అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని ఆర్థిక పరిపుష్టి చేయ గల సత్తా సీఎం కేసీఆర్‌కే ఉందని కార్వాన్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మిత్ర కృష్ణ అన్నారు. మంగళవారం ఆయన కార్వాన్‌లోని అన్ని డివిజన్‌లలో తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తన పదేళ్ల పరిపాలన కాలంలో తెలంగాణకు అన్ని రంగాల్లో కేసీఆర్ అభివృద్ధి చేశారని అన్నారు. అనిల్‌కుమార్, అభిషేక్ తదితరులున్నారు.

బీజేపీకి గుణపాఠం చెప్పాలి



అబిడ్స్: పదేళ్లుగా గోషామహల్‌లో బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ మోసాలకు, అక్రమాలకు పాల్పడుతూ ప్రజల అభివృద్ధిని విస్మరించారని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా పేర్కొన్నారు. మంగళ్‌హాట్ పరిధిలోని అప్పర్ ధూల్‌పేట్, గంగాబౌలి, ఆకాష్‌పురి హనుమాన్ ఆలయ ప్రాంతం, నట్రాజ్‌నగర్, రహీంపురా, మాగ్రా తదితర ప్రాంతాల్లో ప్రచారం చివరి రోజున బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 25 ఏళ్లుగా గోషామహల్ ప్రజలకు అందుబాటులో ఉంటున్న బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ను గెలిపించాలని కోరారు. ఆనంద్‌సింగ్, బల్‌దేవ్ సింగ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్‌లో హ్యాట్రిక్ విజయం సాధిస్తా



అబిడ్స్: గోషామహల్‌లో హ్యాట్రిక్ విజయం తనదేనని బీజేపీ అభ్యర్థి ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. పదేళ్లుగా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించానన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా విజయం తనదేనన్నారు. తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్‌రాథోడ్, బీజేపీ నాయకులు గోవింద్‌రాఠి, శంకర్ యాదవ్, గోపాల్‌జీ పాల్గొన్నారు.

ఘనంగా మహా అన్నకూట మహోత్సవం



చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో మహా అన్నకూట మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో సుల్తాన్‌షాహీ జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్ రాకేష్ తివారీ, చార్మినార్ బీజేపీ అభ్యర్థి మెఘారాణి అగర్వాల్, టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు నాగ్‌నాథ్ మాశెట్టి దంపతులు పాల్గొన్నారు. భక్తులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకున్నామని ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు.

గోల్కొండ ఆస్పత్రిలో వరల్డ్ ఎయిడ్స్ డే



గోల్కొండ: ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల నిర్లక్ష్యం తగదని గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహర్ ఉల్లా అన్నారు. మంగళవారం వరల్డ్ ఎయిడ్స్ డే–2023 నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల చాలా మంది చిన్న చూపు చూస్తున్నారని, ఇది సమంజసం కాదన్నారు. ఎయిడ్స్ సొసైటీ ప్రతినిధులు దిలీప్, శ్రీనివాస్, ఆస్పత్రి ఇన్‌చార్జి ఆర్‌ఎంఓ డాక్టర్ శ్రీనివాస్‌రావు, నర్సింగ్ సూపరింటెండెంట్ కమలమ్మ ఉన్నారు.

అభివృద్ధి చేసే నాయకులను ఎన్నుకోవాలి



విజయనగర్‌కాలనీ: 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కులమతాలకు అతీతంగా అభివృద్ధి చేసే నాయకులకు ఓటు వేయాలని నినాదిస్తూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. విజయనగర్‌కాలనీ సెయింటాన్స్ బాలికోన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు మంగళవారం విజయనగర్‌కాలనీ పరిసర ప్రాంతాల్లో ర్యాలీ ఓటర్లను ఆలోచింప చేసింది. ప్రిన్సిపాల్ సిస్టర్ ఆరోగ్యమేరి దివ్య, కరస్పాండెంట్ రోజీ ఫ్రాన్సిస్‌లతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయం ఖాయం



చార్మినార్: కాంగ్రెస్ విజయం ఖాయమని ఆ పార్టీ మాజీ టీపీసీసీ కార్యదర్శి కేఎస్ ఆనంద్‌రావు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన జన్మదినం సందర్భంగా గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యామ్ రావు ముదిరాజ్‌తో పాటు పలువురు ఆయనను సత్కరించారు.

అన్ని సీట్లు గెలుస్తాం: ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ



చార్మినార్: ఈ ఎన్నికల్లో తాము పోటీ చేస్తున్న అన్ని సీట్లను కైవసం చేసుకుంటామని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా మంగళవారం ఖిల్వత్ గ్రౌండ్ లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం తాము 9 సీట్లలో పోటీ చేస్తున్నామని, వీటిలో విజయం సాధిస్తామన్నారు.

సంగంలో స్వామి వారికి చక్రస్నానం



లంగర్‌హౌస్: శ్రీరామ నామస్మరణతో లంగర్‌హౌస్ ప్రాంతం మార్మోగింది. లంగర్‌హౌస్ త్రివేణి సంగంలో వెలసిన చారిత్రాత్మక మఠదేవాలయం జానకీ సమేత వీరవెంకట విజయరాఘవస్వామి ఆలయంలో కార్తీక ముక్తిస్నానాల జాతర సందర్భంగా మంగళవారం స్వామివారికి చక్రస్నానం నిర్వహించారు. పీఠాధిపతి రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో వేద పండితులు శ్రీనివాస్, రింకు శాస్త్రిలు సీతారామలక్ష్మణులకు ప్రత్యేక పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం సుగంధ ద్రవ్యాలతో చక్రస్నానం జరిపించారు. ఇందులో భాగంగా ఆలయ ప్రాంగణంలో రాహుల్‌దాస్ బాబాతో పాటు, భక్తులు చక్రస్నానాలు ఆచరించారు. ఈ వేడుకల్లో సేవకులు లింగారెడ్డి, సుశీల్, రవి, బిచ్చన్న పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బైక్ ర్యాలీ


ర్యాలీలో జగన్‌మోహన్‌రెడ్డి, పురుషోత్తమ్‌రావు తదితరులు

అబిడ్స్: గోషామహల్‌లో బీజేపీ అభ్యర్థి రాజాసింగ్‌పై బీఆర్‌ఎస్ అభ్యర్థి 25 వేల మెజార్టీతో విజయం సాధిస్తారని రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చైర్మన్ పి.జగన్మోహన్ రావు పేర్కొన్నారు. మంగళవారం గోషామహల్, ఆగాపురా, టక్కరివాడి, గ్యాస్‌బాగ్‌కాలనీ పరిసర ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఆల పురుషోత్తమ్‌రావుతో పాటు పలువురు నాయకులతో కలిసి భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జగన్ మోహన్‌రావు మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి రాజాసింగ్ చిత్తుగా ఓడిపోవడం ఖాయమైందన్నారు. దాదాపు 25 వేలకు పైగా మెజార్టీతో తమ బీఆర్‌ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్ విజయం సాధించబోతున్నారని ఆయన అన్నారు. పురుషోత్తమ్‌రావు, సురేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దర్బార్ మైసమ్మ సాక్షిగా గెలుస్తా


మాట్లాడుతున్న అమర్‌సింగ్

జియాగూడ: కార్వాన్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు డమ్మీలు కావడంతో తను గెలుపు దర్బార్ మైసమ్మ సాక్షిగా ఖాయమని కార్వాన్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్ అన్నారు. మంగళవారం పురానాపూల్ హనుమాన్ ఆలయం నుంచి బైక్‌ర్యాలీ ఊరేగింపు ప్రారంభమైంది. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో బైక్‌ర్యాలీ నిర్వహించి చివరగా దర్బార్ మైసమ్మ దగ్గర ముగిసింది. ఆయన మాట్లాడుతూ..కార్వాన్‌లో ఓటర్లు బీజేపీకే ఓట్లు వేస్తారని ఆయన పేర్కొన్నారు. గోవర్ధన్, డిజ్వర్‌సింగ్, యోగిరాజ్ సింగ్, శివకుమార్ యాదవ్, లక్ష్మీనారాయణ్, శ్రీకాంత్, బండారి రాధిక పాల్గొన్నారు.

గోషామహల్‌ను గచ్చిబౌలి తరహాలో అభివృద్ధి చేస్తాం


ముగింపు ర్యాలీలో మోతే శోభన్‌రెడ్డి, సంతోష్ గుప్తా, మమతా గుప్తా

అబిడ్స్: గోషామహల్‌లో బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే గచ్చిబౌలి తరహాలో గోషామహల్‌ను అభివృద్ధి చేస్తామని బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి మోతే శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎగ్జిబిషన్ గ్రౌండ్ నుంచి ఎన్నికల ముగింపు ప్రచారం ర్యాలీని ప్రారంభించారు. అనంతరం మోతే శోభన్‌రెడ్డి మాట్లాడుతూ..పదేళ్లుగా అభివృద్ధిలో వెనుకబడిన గోషామహల్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. నందకిశోర్ వ్యాస్‌ను గెలిపిస్తే గోషామహల్‌ను గచ్చిబౌలీ తరహాలో మంత్రి కేటీఆర్ స్వయంగా అభివృద్ధి చేస్తారని ఆయన అన్నారు. మాజీ కార్పొరేటర్లు మమతా గుప్తా, రాంచందర్ రాజు, బీఆర్‌ఎస్ నాయకులు సంతోష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

'రాజాసింగ్ భారీ మెజార్టీతో గెలుస్తారు'



సుల్తాన్‌బజార్: గోషామహల్‌లో బీఆర్ఎస్ పార్టీకి నుకల్ చెల్లిపోయాని బీజేపీ అభ్యర్థి రాజాసింగ్ అన్నారు. మంగళవారం జాంబాగ్‌లో కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజాసింగ్ అభిమానులు భారీ గజమాలతో స్వాగతం పలికారు. కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ మాట్లాడుతూ..గోషామహల్‌లో రాజాసింగ్ గెలుపు ఎంతో సునాయసమన్నారు. గోషామహల్‌లో రాజాసింగ్ భారీ మెజార్టీతో గెలుపొందుతారని ధీమా వ్యక్తం చేశారు.

నాంపల్లిలో బీఆర్‌ఎస్ ప్రచారం



నాంపల్లి: నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి సీహెచ్.ఆనంద్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ బజార్‌ఘాట్‌లోని ఏడుగుళ్ల పోచమ్మ ఆలయం వద్ద ప్రారంభమై జంగంబస్తీ, కోర్టు రోడ్డు, ఏసీగార్డ్స్, ఎస్‌బిఐ బ్యాంక్ లేన్, చింతలబస్తీ రోడ్డు, ఖాజా మాన్షన్, అహ్మద్ నగర్, ఎన్‌ఎండిసి రోడ్డు, మెహిదీపట్నం, మురాద్‌నగర్, ఆసిఫ్‌నగర్, నోబుల్ టాకీస్ చౌరస్తా, అఫ్జల్‌సాగర్, ఏబ్యాట్రీలేన్ మీదగా నాంపల్లి పటేల్ బాడా వరకు కొనసాగింది.

నియామకం



గౌలిపురా: పాతనగర మున్నూరు కాపు సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీగా పుప్పాల మధుసూదన్ నియమితులయ్యారు. మంగళవారం ఆయన పాతనగర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు తిరుపతి శివ కుమార్, ముఖ్య సలహాదారులు కమతం రమేష్ చేతుల మీదుగా నియమాకపత్రాన్ని అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. బాధ్యతలు అప్పగించినందుకు సంఘం ముఖ్య నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతు తెలిపారు.

గెలిపిస్తే అభివృద్ధి చేస్తా

బహదూర్‌పురా: బహదూర్‌పురా నియోజకవర్గం ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి మహ్మద్ అజ్హరుద్దీన్ ఖాద్రీ మంగళవారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. సింహం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపిస్తే పాతబస్తీ అభివృద్ధి చేస్తానన్నారు. ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



'ఎమ్మెల్యే రాజాసింగ్‌కు పరాభవం తప్పదు'


ర్యాలీలను ప్రారంభిస్తున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్, ఆనంద్‌కుమార్, బెజిని శ్రీనివాస్

అబిడ్స్: ఎమ్మెల్యే రాజాసింగ్‌కు పరాభవం తప్పదని బీఆర్‌ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో మంగళవారం ప్రచారం ముంగిపు సందర్భంగా ర్యాలీలను ప్రారంభించారు. అనంతరం నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ..ఓటు వేసే ముందు ప్రజలు ఒక్కసారి ఆలోచించాలన్నారు. 25 ఏళ్లుగా గోషామహల్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆనంద్‌కుమార్ గౌడ్, ఆల పురుషోత్తంరావు, ముఖేష్ ముదిరాజ్, సురేష్ ముదిరాజ్, బెజిని శ్రీనివాస్, యాదగిరి, రమేష్ గుప్తా పాల్గొన్నారు.

గౌలిపురాలో బీజేపీ బైక్ ర్యాలీ



గౌలిపురా: యాకుత్‌పురా బీజేపీ అభ్యర్థి వీరేందర్ బాబు యాదవ్ గౌలిపురా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ బతుకమ్మ బావి నుంచి ప్రారంభమై గౌలిపురా గాంధీబొమ్మ, హనుమాన్‌నగర్, పటేల్‌నగర్, దానయ్యనగర్ తదితర ప్రాంతాల్లో కొనసాగింది. కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

అబిడ్స్: సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయని రాష్ట్ర బీఆర్‌ఎస్ ఈఎస్‌ఐ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు చలపతిరావు పేర్కొన్నారు. గోషామహల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్‌తో కలిసి జాంబాగ్ పరిసర ప్రాంతాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. చలపతిరావు మాట్లాడుతూ..అవినీతి బీజేపీ ఎమ్మెల్యేకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.